క్లుప్తంగా

ప్రలోభాలకు లొంగవద్దు

కాకినాడ రూరల్: బాలికలు, మహిళలను మభ్యపెట్టడం, బెదిరించడం లేదా ప్రలోభాలకు గురిచేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాపై మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సదస్సులో అడబాల రత్నప్రసాద్, ఇందుగుల ప్రసాద్‌నాయుడు, ఓం నమశ్శివాయ, పార్థశారధి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 500 మందికి సేవలు



వైద్యశిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కరప: మండలం పెద్దాపురప్పాడులో మంగళవారం ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి, స్టీఫెన్ ఆనంద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ మారెళ్ల స్టీఫెన్ ఆనంద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పెద్దాపురప్పాడు పరిసర గ్రామాల నుంచి 500 మంది శిబిరానికి రాగా కంటి, దంత పరీక్షలు చేశారు. షుగర్, బీపీ, రక్త పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు, పేస్ట్, బ్రష్‌లు అందజేశారు. కంటివైద్య నిపుణులు డాక్టర్ తిరుమలశెట్టి అరుణ, దంతవైద్యులు డాక్టర్ ఆనెం చైతన్య తదితరులు వైద్య సేవలు అందించారు. ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాస అప్పారావు, మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: స్థానిక నక్కావారి ఎస్సీ వీధిలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు నోట్ పుస్తకాలు, పెన్నులు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు అందజేశారు. కాకినాడ ఆనందభారతి మున్సిపల్ స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ఏటా ఈ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు ఉచితంగా అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. హెచ్‌ఎం వినాద్రి, డేగల లక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

లోక కల్యాణం కోసం చతుర్వేద పారాయణ



ఆలయంలో చతుర్వేద పారాయణ చేస్తున్న వేద పండితులు

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం జంక్షన్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ దేవస్థానం ఆధ్వర్యంలో దినత్రయ చతుర్వేద పారాయణం రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు చేపడుతున్న ఈ పారాయణం ద్వారా లోకకల్యాణం, దేశ సుభిక్షం కోసం చేపడుతున్నట్టు దేవస్థానం పురోహితులు తెలిపారు. బుధవారంతో పారాయణం ముగియనుంది.

బాదం సుందరరావుకు డాక్టరేట్



బాలాజీచెరువు: నిపుణుల బృంద సిఫార్సు మేరకూ జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ బాదం ఎస్‌వీవీఎస్ సుందరరరావుకు మంగళవారం డాక్టరేట్ ప్రకటించింది. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏన్ ఇన్వెస్టిగేషన్ ఆన్ స్ట్రెంతెనింగ్ స్ట్రక్చరల్ ఎలిమెంట్స్ ఆఫ్ వేరియస్ గ్రేడ్స్ ఆఫ్ కాంక్రీట్ అడాప్టింగ్ డిఫరెంట్ టెక్నిక్స్(వివిధ గ్రేడ్‌ల కాంక్రీట్ స్ట్రక్చరల్, ఎలిమెంట్‌లను పటిష్టం చేయడం) అంశంపై సిద్ధాంత వ్యాసం రచించారు. వర్సిటీ రీసెర్చ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర పర్యవేక్షణలో ఆయన తన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.

అపురూపమైన బంధం స్నేహం

కాకినాడ రూరల్: అనుబంధాల మేలు కలయిక స్నేహమని, ఇది ఒక అపురూపమైన అనుబంధమని డాక్టర్ అద్దాల సత్యనారాయణ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నేహ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1998 నుంచి అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.



నాడు నక్షత్రాలకు అనుగుణంగా నాటిన మొక్కలతో ఉన్న వనం



పుర్వాభాద్ర నక్షత్రానికి సంబంధించి నాటిన మొక్క



నేడు తుప్పలు, గడ్డి పెరిగిపోయి అధ్వానంగా ఉన్న వనం

వనం.. కళావిహీనం

- నాడు అవగాహన కల్పించేలా నవనవలాడిన నక్షత్ర వనం
- నేడు తుప్పలతో అధ్వానం
- నిర్వహణ లేక అడవిని తలపిస్తున్న వైనం

బాలాజీచెరువు: నగరం మధ్యలో దాదాపు 70 ఏకరాలకు పైబడి ఉన్న జేఎన్‌టీయూకేలో పర్యావరణ ప్రాజెక్టుగా ఏర్పాటు చేసిన నక్షత్ర వనం నేడు నిర్వీరంగా మారింది. 2010లో నక్షత్ర వనం పేరుతో దాదాపు ఎకరానికి పైగా స్థలంలో మొక్కలు నాటడానికి ప్రణాళిక రూపొదించి దానికి శంకుస్థాపన చేసినా నేటికీ పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దాదాపు 12 ఏళ్ల పాటు ఆ ప్రాంతం నిరుపయోగంగా మారింది. గత ఏడాది మాజీ వీసీ డాక్టర్ ప్రసాదరాజు చొరవ తీసుకుని పనుల్లో కదలిక తీసుకువచ్చారు. పర్యావరణ ప్రేమికుడైన ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ ఆ కాలంలో గ్రీన్ ఇనిషియేటివ్ డైరెక్టర్‌గా కీలక పాత్ర పోషించారు. అలాగే మియావాకీ ప్లాంటేషన్ పేరుతో 2020 మొక్కలు నాటి మినీ అడవిగా ఏర్పాటు చేయగా, ప్రిన్సిపాల్ కార్యాలయం పక్కన ఆయన రూపొందించిన ప్రాజెక్టులను జంగిల్ బుక్ పేరుతో మొక్కల మధ్యలో పాఠ్యాంశాలు బోధించేలా ఏర్పాటు చేశారు. కళాశాల పూర్వ విద్యార్థి రేఖపల్లి శ్రీనివాసరావు ఆర్థిక చేయూతతో నక్షత్రవనంలో కొంత భాగాన్ని వినియోగంలోకి తీసుకువచ్చారు. గ్రీన్ క్యాంపస్ ఆడిట్‌లో ఇవి తోడ్పడ్డాయి.

నక్షత్ర వనం అంటే..

మనిషి పుట్టిన సమయం బట్టి జన్మ నక్షత్రం ఉంటుంది. కాలగమనం ప్రకారం జన్మనక్షత్రాలు అశ్విని మొదలు రేవతి వరకు ఒక్కో దానికి ఒకొక్క రకమైన మొక్క ఉంటుంది. అలాగే 27 నక్షత్రాలతో 108 మొక్కలను ప్రత్యేకమైన ప్రాంతంలో ఏర్పాటుచేసి ప్రతి మొక్క వద్ద ఆ మొక్కకు సంబంధించి నక్షత్రం పేరు రాసి అక్కడ క్యూఆర్ బోర్డు ఏర్పాటు చేశారు. దానిని స్కాన్ చేస్తే మొక్క రకం, ఆ జన్మనక్షత్ర రాశివారి గుణగుణాలు, వారి స్వభావం తదితర సమాచారం నిక్షిప్తమై ఉంటుంది. నేడు అదంతా కళావిహీనంగా మారింది.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



వర్సిటీతో పాటు కళాశాల ఆవరణలో పర్యావరణ ప్రాజెక్టుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. గ్రీన్ క్యాంపస్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పర్యావరణానికి సంబంధించి పలు ప్రాజెక్టులు చేపట్టి విద్యార్థులను భాగస్వామ్యం చేసి పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నాం. 75 ఏళ్ల వయసు పైబడి ఉన్న చెట్ల నిర్వహణకు, నిత్య నూతనంగా, పచ్చగా ఉండేలా చూసేందుకు, దాని నిర్వహణ బాధ్యతలు తీసుకున్న వారికి ఏడాదికి రూ.2500 పెన్షన్ ఇచ్చే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం.

– డాక్టర్ మురళీకృష్ణ, ఇన్‌చార్జి వీసీ, జేఎన్‌టీయూకే

శ్యామ్‌కు ఎస్పీ అభినందన



ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్యామ్

బోట్‌క్లబ్: శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో నిరుద్యోగ యువతీ యువకులకు ఉత్తమ శిక్షణ ఇవ్వడంపై ఆ సంస్థ అధినేత శ్యామ్‌ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్ పాటిల్‌ను ఆయన కార్యాలయంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో పోలీస్ కోచింగ్‌తో పాటు ఇతర కాంపిటేటివ్ పరీక్షలకు ఉత్తమ శిక్షణ ఇవ్వడంపై అధినేత శ్యామ్‌ను అభినందించారు. ఎస్పీని కలిసిన వారిలో శ్యామ్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ కాంతారావు ఉన్నారు.

పింఛన్ల పంపిణీకి అంతా సిద్ధం కావాలి



కరపలో గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: పింఛన్ల పంపిణీ ఆగస్టు నెల ఒకటో తేదీనే పంపిణీ చేసేలా గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు అన్నీ సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమై పింఛన్ల పంపిణీ, పీజీఆర్ఎస్‌లో వచ్చే ఫిర్యాదు పరిష్కార చర్యలు, గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణపై సమీక్షించారు. అనుసరించాల్సిన విధివిధానాలపై సూచనలిచ్చారు. గ్రామ సచివాలయం స్థాయిలో ఆయా సిబ్బందితో సమావేశమై మ్యాపింగ్ చేసిన పింఛన్లను పంపిణీ చేసేందుకు అవసరమైన మొబైల్ ఫోన్, డివైజ్‌ల పనితీరును పరిశీలించి, సిద్ధం చేసుకోవాలన్నారు. గతనెలలో తీసుకోనివారికి ప్రత్యేకంగా ఫోన్‌చేసి, ఈ నెలలో ఒకటో తేదీ ఒక్క రోజునే ఇవ్వడం జరగుతుందని తెలియజేయాలని, గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్నవారికి ఫోన్ ద్వారా సమాచారం అందజేయాలని, ఆ రోజు ఉదయం 5 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార విభాగం ద్వారా స్వీకరించే అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. క్లోరినేషన్ చేసిన తర్వాతనే తాగునీరు సరఫరా చేయాలని ఎంపీడీఓ తెలిపారు. ఈఓ పీఆర్డీ బీఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ దార్శనికుడు రాంషా

- ఆయన రచనలు వాస్తవాలకు ప్రతిబింబాలన్న సాహితీవేత్తలు
- ఘనంగా శత జయంతి వేడుకలు



'గోదావరి పొంగింది' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

బోట్‌క్లబ్: సుప్రసిద్ధ సాహితీవేత్త, అభిసారిక దాంపత్య విజ్ఞాన మాసపత్రిక వ్యవస్థాపకులు దివంగత దర్భా రాంషా జీవిత చరిత్ర పరిశీలిస్తే సమాజ దార్శనికుడిగా వినుతికెక్కారని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం స్థానిక రోటరీ హాల్‌లో రాంషా శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొరుప్రోలు గౌరినాయుడు అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు ప్రసంగిస్తూ రాంషా సాహిత్యం ద్వారా సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసారన్నారు. పలు సంకలనాలపై విమర్శ చేస్తూ ముద్రించిన రచనలు ఎంతో విమర్శనాత్మకంగా, ఆలోచింపజేసే విధంగా ఉన్నాయని కొనియాడారు. నాటకాలు, నాటికలు, కావ్యసంపుటి, కథా సంకలనాలు, తాత్విక, ధార్మిక గ్రంథాలు, సైన్స్ పుస్తకాలు వంటి అనేక అంశాలపై ఆయన చేసిన రచనలు వాస్తవాలను ప్రతిబింబించేలా ఉండడమే కాక అనేక మందికి మార్గదర్శకంగా ఉన్నాయన్నారు. కుటుంబ పరంగా ఎన్నో అంశాలను తన సంతానానికి బోధించడమే కాక సమాజంలో ఎలా నడుచుకోవాలన్న అంశంపై కూడా చేసిన రచనలు అందరినీ ఆలోచింపజేసే విధంగా ఉన్నాయన్నారు. రాంషా రచనలకు, సాహిత్యానికి సముచిత స్థానం దక్కలేదని వారు అభిప్రాయపడ్డారు. శతజయంతి ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ఆయన వ్యక్తిత్వంతో పాటు ఆలోచనా సరళి కూడా నేటి ప్రపంచానికి ఎంతో అవసరమని పలువురు అన్నారు. 'ఆధ్యాత్మిక కోణంలో రాంషా' అనే అంశంపై కాశీభొట్ల సత్యనారామణ, ధర్మరతి ప్రతిపాదకుడు రాంషా అని అంశంపై జీవీ పూర్ణ చందు, కవి రచయితగా రాంషా అనే అంశంపై కార్తికేయ శర్మ, తెలుగు సాహిత్యలోకంపై రాంషా ప్రభావం అనే అంశంపై జయంతి నాగేశ్వరరావు, స్మృతి అనే అంశంపై ఆచార్య టి.విశ్వనాథరావు ప్రసంగించారు. రాంషా శతజయంతి పురస్కారాలను సాహ్యిరంగంలో విశేషకృషి చేసిన మాకినీడి సూర్య భాస్కర్, సెక్సాలజీ రంగంలో ప్రొఫెసర్ డాక్టర్ గోదా వెంకటరమణలకు అందజేశారు. ఈ సందర్భంగా రాంషా రచించిన 'గోదావరి పొంగింది' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

విద్యార్థుల శ్రేయస్సు లక్ష్యంగా సేవలందించాలి

జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ డాక్టర్ మురళీకృష్ణ



రిజిస్ట్రార్ రవీంద్రను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ మురళీకృష్ణ



జేఎన్‌టీయూకే కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావును అభినందిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థులకు ఏ విధమైన ఆటకం లేకుండా వారి శ్రేయస్సు లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సేవలందించాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమితులైన ప్రొఫెసర్ రవీంద్ర మంగళవారం బాధ్యతలు స్వీకరించగా ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ వర్సిటీలో కీలకమైనది రిజిస్ట్రార్ విభాగమని, అన్ని డైరెక్టరేట్‌లను సమన్వయం చేసుకుంటూ వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం డైరెక్టర్ అఫ్ ఆడిట్‌గా నియమితులైన డాక్టర్ ఏసురత్నం, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎన్.మోహనరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ రమణ, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారిణికి వృద్ధాశ్రమంలో ఆశ్రయం

కళాకారిణిని వృద్ధాశ్రమంలో చేర్చిన సానా సతీష్‌బాబు ఫౌండేషన్



సుబ్బలక్ష్మిని ఆశ్రమంలో చేరుస్తున్న తలాటం హరీష్

బోట్‌క్లబ్: ఒకప్పుడు కళాకారిణిగా మంచి గుర్తింపు పొందిన మురమళ్ల సుబ్బలక్ష్మిని మంగళవారం సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ఏపీఎస్పీ ఎదురుగా ఉన్న ఆదర్శ వయోవృద్ధుల ఆశ్రమంలో చేర్చారు. నాటక రంగంలో ఎంతో పేరుగాంచిన ఆమెకు ఎవరూ దిక్కులేరన్న విషయాన్ని స్నేహితుల ద్వారా తెలుసుకున్న హరీష్ ఆమెను వృద్ధాశ్రమంలో చేర్చారు. ఆమెకు అయ్యే ఖర్చు తాను భరిస్తానని, పింఛను అందేలా కృషి చేస్తానని అన్నారు. అంతే కాకుండా ఆశ్రమానికి తన వంతు సహకారం అందిస్తానని ఆశ్రమ వ్యవస్థాపకుడు వైఎస్సార్ చౌదరికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నటరాజ రాష్ట్ర కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రభాకరరావు, కార్యదర్శి ఎలిశెట్టి భానుమతి, ఫౌండేషన్ కార్యదర్శి ముమ్మిడి వెంకటేష్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి యనమదల రాజేష్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత



విద్యార్థులు, నాయకులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కరప: పాఠశాల స్థాయి నుంచి విద్యతో పాటు ఆటలలో కూడా రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. పాఠశాలల్లో ప్రతిరోజూ డ్రిల్ పీరియడ్ ఉండేలా చూడాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. మండలం పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పాఠశాలలన్నింటిలో క్రీడలకు సదుపాయాలు కల్పించి, క్రీడా సామగ్రి అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఆరుగురు విద్యార్థినులకు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొండా చంటిబాబు, ఉపాధ్యాయులు, ఎలియన్స్ క్లబ్ ప్రతినిధుల సహకారంతో ఒక్కొక్కరికి రూ.2,500 వంతున నగదును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. సర్పంచ్ బిరుదా సరస్వతి, ఎంపీటీసీ పబ్బినీడి పద్మావతి, డాక్టర్ బొండా సూర్యారావు, చప్పిడి వెంకటేశ్వరరావు, డీవైఈఓ కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్‌ఎం ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్, పీడీ బీవీవీఎస్ ప్రసాద్, మండల బీజేపీ అధ్యక్షుడు బండారు మురళి తదితర నాయకులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మేజిస్ట్రేట్ తనిఖీలు



భోజనాన్ని పరిశీలిస్తున్న మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీదేవి

కాకినాడ లీగల్: స్థానిక అశోక్ నగర్‌లో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహాల్లో విద్యార్థులను మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.శ్రీదేవి మంగళవారం పరిశీలించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి ఆదేశాల మేరకు ఆమె వసతి గృహ భవనాలు పరిశీలించారు. వసతిగృహాల్లో విద్యార్థినులకు అందుతున్న వసతులు, సదుపాయాలపై న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు.అలాగే రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వసతిగృహాల్లో ఉన్న విద్యార్థినులకు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి అబాకస్‌లో కౌశిక్‌కు కాంస్యం



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విజవాడలో ఈ నెల 28న జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్, మెంటల్ ఎబిలిటీ పోటీలలో కాకినాడకు చెందిన బీవీ రమణ కౌశిక్ పాల్గొని ప్రతిభను కనబరిచాడు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 3వ స్థానం పొంది కాంస్య పతకం, కప్‌ను అందుకున్నాడు. స్థానిక రామారావు పేటలోని నారాయణ స్కూల్‌లో కౌశిక్ ఆరో తరగతి చదువుతున్నాడు. కౌషిక్‌ను మంగళవారం పాఠశాల ఏజీఎం కె. రాఘవేంద్రరావు తదితరులు అభినందించారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరు ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహన చోదకులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ హరిబాబు, క్యాంపస్ సిబ్బంది, విద్యార్థులు హెల్మెట్ వల్ల లభించే రక్షణ గురించి వివరించారు. అంతకు ముందు పీజీ సెంటర్ వద్ద ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్రీ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ పోచయ్య, మధుకుమార్, గోపి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సొంతింటి కల టీడీపీతోనే సాధ్యం

కాకినాడ సిటీ: పేదవారి సొంతింటి కల టీడీపీతోనే సాధ్యమని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. మంగళవారం టీడీపీ ప్రకటించిన సంక్షేమపథకాలపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం సాయం అందించనుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

భారీ మొత్తంలో గంజాయి స్వాధీనం...?

కాకినాడ క్రైమ్: కాకినాడ వన్ టౌన్ పీఎస్ పరిధిలో మంగళవారం భారీ మొత్తంలో గంజాయి పట్టుబట్టినట్లు సమాచారం. గంజాయితో పాటు పలువురు నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది. అయితే ఈ విషయంపై పోలీసులు ఎటువంటి స్పష్టత ఇవ్వడం లేదు. లోతైన విచారణ అనంతరం అధికారికంగా వెల్లడిస్తారనే ప్రచారం ఉంది.

పంచారామ క్షేత్రంలో అధికారుల పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామ భీమేశ్వరాలయంలో రాష్ట్ర స్థాయి అధికారులు మంగళవారం స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం లభించింది. ఆదాయ పన్నుశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిధాలి మధుస్మిత, చీఫ్ కమిషనర్ వరీంద్ర మోహతా, ప్రిన్సిపల్ కమిషనర్ సునిత బిల్లా, అడ్మిన్ ప్రిన్సిల్ కమిషనర్ రవికిరణ్, టీడీఎస్ ప్రిన్సిపల్ కమిషనర్ నరేష్ సాకాలు ఆలయంలో స్వామి వారిని అమ్మవార్లకు దర్శించుకున్నారు. వారికి ఆలయ పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈఓ వారికి ప్రసాదం, స్వామి వారి ఫోటోలను అందజేశారు.



రాష్ట్ర స్థాయి అధికారులకు ఆశీర్వచనాలు అందజేసిన ఆలయ వేద పండితులు